ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

నగర వ్యాప్తంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, సాయంత్రం వేళ ఆలయాల వద్దకు చేరి ఒకచోట పెట్టారు. వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం పరస్పరం వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్


శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కాశిబుగ్గ కనకదుర్గామాత దేవాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మడికొండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


హసన్‌పర్తి: ఎస్‌వీఎస్‌లో బతుకమ్మ సంబురాలు


బతుకమ్మలతో మూడు తరాలు



బతుకమ్మలతో చిన్నారులు


వరంగల్: మణికంఠ కాలనీలో..


ఎన్జీవోస్ కాలనీలో..


రాంనగర్‌లో..


నయింనగర్‌లో..


వడ్డేపల్లి కనకదుర్గకాలనీలో..


హనుమకొండ ప్రశాంత్‌నగర్ ఫేజ్ -3లో..


వరంగల్ రుద్రమనగర్‌లో..


కాజీపేట చైతన్యపురి కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నయింనగర్: గీతాంజలి కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో..


హనుమకొండ గోపాలపురంలో..

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 15న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. పోతన సబ్ స్టేషన్ ప్రాంతంలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, కేఎంసీ సబ్ స్టేషన్ ప్రాంతంలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. చింతగట్టు క్యాంప్, నారాయణ నగర్, ఎర్రగట్టు గుట్ట, కిట్స్ క్రాస్ ప్రాంతం, హసన్‌పర్తి, రామారం, భీమారం, చింతగట్టు, కోమటిపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

నేటి నుంచి బంగారు మైసమ్మ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



కాశిబుగ్గ: 19వ డివిజన్ కాశిబుగ్గలోని బంగారు మైసమ్మదేవి ఆలయంలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి కుడికాల కోటేశ్వర్ తెలిపారు. ఈనెల 15వ నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఒక్కో రోజు ఒక్కో విధంగా అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



హన్మకొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. తమ సమస్యలు చెప్పుకునేందుకు హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చిన నియోజకవర్గ ప్రజల నుంచి చీఫ్‌విప్ శనివారం వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని చెప్పారు.

సెలవుల్లో జాగ్రత్త!


కాజీపేట: బతుకమ్మ, దసరా సెలవుల నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు సూచించారు. కాజీపేట పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ వరుస సెలవుల నేపథ్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తామని చెప్పారు. కాలనీల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడితే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఊర్లెళ్లే ముందు నమ్మకంగా ఉండే ఇరుగుపొరుగు లేదంటే బంధువులకు సమాచారం ఇచ్చి వెళ్లాలన్నారు. వీలైనంత త్వరితగతిన ప్రయాణం ముగించుకుని స్వగృహానికి తరలిరావాలని పేర్కొన్నారు. నగదు, ఆభరణాలు, విలువైన వస్తువులను ఇళ్లలో వదిలి బయటకు వెళ్లొద్దన్నారు. ఆపద సమయంలో డయల్ 100 నంబర్‌తో పాటు 87126 85122 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

బీసీ ఐక్య సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాంచందర్



హన్మకొండ: బీసీ ఐక్య సంఘర్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా చిలువేరు రాంచందర్‌ను నియమించినట్లు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిళి తెలిపారు. బీసీ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్న వరంగల్‌కు చెందిన చిలువేరు రాంచందర్‌ను బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు బీజీఆర్ నారగోని ఆదేశాల మేరకు ఈ పదవిలో నియమించినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

కాంగ్రెస్ పలు విభాగాల అధ్యక్షుల ఎన్నిక



హసన్‌పర్తి: 2వ డివిజన్ కాంగ్రెస్ వంగపహాడ్ శాఖ పలు విభాగాల అధ్యక్షులను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వంగపహాడ్ శాఖ అధ్యక్షుడిగా వలబోలు రవీందర్, యూత్ అధ్యక్షుడిగా దోమ ప్రవీణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మంద జీన్, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఆనందం, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా రాము, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా యాకూబ్‌ను ఎన్నుకున్నట్లు డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు వెల్లడించారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు పోలం అనిల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మార్త రవీందర్ పాల్గొన్నారు.

మహిళలకు ఇష్టమైన పండుగ

హన్మకొండ: తెలంగాణలోని మహిళలకు ఎంతో ఇష్టమైన పెద్ద పండుగ బతుకమ్మ పండుగ అని, ఈ పండుగ రాక కోసం మహిళలందరు ఆత్రుతగా ఎదురు చూస్తుంటారని మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ యాదవ్ అన్నారు. ఎంగిలి పూల బతుకమ్మను పురస్కరించుకుని హనుమకొండ గోకుల్‌నగర్‌లోని తన స్వగృహంలో శనివారం బతుకమ్మ పేర్చారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక

హన్మకొండ: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక.. బతుకమ్మ పండుగ అని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ అన్నమనేని అనిల్ చందర్‌రావు అన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రభుత్వ బాలికా సదనాన్ని శనివారం ఆయన సందర్శించి, పిల్లలకు పండుగ ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం పిల్లలకు పిండి వంటలు అందజేశారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శారద హరిద్రా దర్శనం

రామన్నపేట: వరంగల్‌లోని శృంగేరి శంకర మఠంలో శారద శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రధాన అర్చకుడు సంగమేశ్వర జోషి ఆధ్వర్యంలో అర్చకులు చంద్రశేఖర్ శర్మ, రామకృష్ణ శర్మ, సోమశేఖర శర్మ, వివేక్ జోషి, విశాల్ జోషి, సాయి శర్మ పంచసూక్తులతో సకల నదీజలాలతో మహాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు సమర్పించిన పసుపుతో అమ్మవారిని హరిద్రాలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నరేందర్, ఎమ్మెల్సీ సారయ్య, నాయకులు, తదితరులు దర్శించుకున్నారు.

చౌడేశ్వరి ఆలయంలో పూజలు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారెపెల్లి రాంచంద్రారెడ్డి, నాయకులు తాళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రవళికది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే'


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: గ్రూప్ -2 పరీక్ష వాయిదాతో నిరాశకులోనై అభ్యర్థి ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని, ఆమెది ముమ్మాటికి టీఎస్‌పీఎస్సీ, ప్రభుత్వ హత్యే అని బీసీ విద్యార్థి సంఘం, బీఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటిగేట్ వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవళిక కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఓయూ జేఏసీ, కేయూ విద్యార్థి జేఏసీ నాయకులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం ఆటలాడుకుంటోందని వాపోయారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరగంటి నాగరాజు, పార్ట్‌టైం లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్, బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, బీసీ విద్యార్థి సంఘం కేయూ అధ్యక్షుడు సుదగాని మధుగౌడ్, ఆయా సంఘాల బాధ్యులు సాయిలు, సాయిరాం, శ్రీకాంత్, వెంకటేష్, గణేష్, శ్రీశైలం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్: గ్రూప్ -2 పరీక్షను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేయడంతో హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటున్న ప్రవళిక మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుందని, ఇది కేసీఆర్ ప్రభుత్వం చేసిన హత్యే అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు రాచర్ల బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీఎస్‌పీఎస్సీ ద్వారా నోటిఫికేషన్లు ఇవ్వడం, కోర్టులో కేసులు వేయించడం, పరీక్షలు వాయిదా వేయడం ఆనవాయితీగా మారిందని పేర్కొన్నారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయనే ఆశలు అడియాశలు అయ్యాయని తెలిపారు. బిక్కాజీపల్లిలో జరిగిన దాడిని ప్రజలు ఖండించాలని ఆయన కోరారు.

హన్మకొండ: ఆత్మహత్య చేసుకున్న ప్రవళికది ప్రభుత్వ హత్యే అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి తెలిపారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించకుండా, వరుసగా వాయిదాలు వేస్తుండడంతో మనస్థాపంతో ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ ను గద్దె దింపితేనే నిరుద్యోగుల కలలు సాకారం అవుతాయని రాకేష్ రెడ్డి తెలిపారు.

జానుల్లా ఖబ్రస్థాన్‌ను కాపాడుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న నూరొద్దీన్

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని హజ్రత్ సయ్యద్ జానుల్లా షహీద్ ఖబ్రస్థాన్‌ను సమష్టిగా కాపాడుకుందామని జానుల్లా షహీద్ దర్గా, ఖబ్రస్థాన్ కేర్ టేకర్ ఏకే.తన్వీర్, ఖబ్రస్థాన్ అధ్యక్షుడు మహ్మద్ నూరొద్దీన్ అన్నారు. ఈమేరకు వరంగల్ శంభునిపేటలో శనివారం జరిగిన హజ్రత్ సయ్యద్ జానుల్లా షహీద్ ఖబ్రస్థాన్ అభివృద్ధి కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఖబ్రస్థాన్‌లో వీధిదీపాలు లేక అంధకారం నెలకొందని, రాత్రి వేళల్లో సమాధి చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలకు తావులేకుండా అసంపూర్తిగా ఉన్న ప్రహరీ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో ఎండీ.గౌస్ పాషా, మన్సూర్ అలీ, ఎంఏ.ఫహీమ్, మహమూద్ పాషా, ముఖాత్ ఖాన్, జకీర్, వలీ, షేక్ తహసీన్, ముసైద్ తైసీర్, మొహిసిన్, ఖహీమ్, సంబాని, ముజాహిద్, రహీమాన్, సర్వర్ బేగ్, అమీర్, దస్తగిరి, సలీమ్, సుల్తాన్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



కుట్టుమిషన్లు అందజేసిన మసూద్, నిర్వాహకులు

న్యూశాయంపేట: కుట్టుశిక్షణ ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ అన్నారు. హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టుశిక్షణ కేంద్రంలో 4వ బ్యాచ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లు శనివారం అందజేశారు. ఫోరం కన్వీనర్ డాక్టర్ అనీస్‌సిద్దిఖీ అధ్యక్షతన జరిగిన కేయూ ప్రొఫెసర్ ముస్తఫా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు ఎంఏ.కలీం, నస్రీన్ వాహిదీ, సయ్యద్ అక్బర్, నదీం బేగ్, మాషూఖ్ రబ్బానీ, అజీం, నుస్రత్, కనీజుల్ వరా పాల్గొన్నారు.

దేవాదాయశాఖ అధికారులపై చర్య తీసుకోవాలి

కాశిబుగ్గ: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో దయానందకాలనీలోని కనకదుర్గామాత దేవాలయం ట్రస్ట్ బోర్డు నియామక ఉత్తర్వులు విడుదల చేసిన వరంగల్ దేవాదాయ శాఖ అధికారులపై చర్య తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ డిమాండ్ చేశారు. ఈమేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి సీ-విజిల్ యాప్ ద్వారా శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా దేవాదాయ శాఖ అధికారులు వ్యవహరిస్తూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో నియామక ఉత్తర్వులు వెలువరించారని పేర్కొన్నారు. ప్రస్తుతం దీనిపై హైకోర్టులో కేసు నడుస్తోందని, ఎలాంటి తీర్పు వెలువడక ముందే దేవాదాయ శాఖ ఉత్తర్వులు వెలువరించడం సరికాదని తెలిపారు. ఎన్నికల అధికారులు స్పందించి ట్రస్ట్ బోర్డు నియామకం రద్దు చేసి దేవాదాయ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

సంక్షిప్తంగా

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు

కాజీపేట: కొంతకాలంగా బాలికను బెదిరిస్తూ శారీరక వాంఛ తీర్చుకుంటున్న ఓ యువకుడిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. సీఐ కథనం ప్రకారం చింతల్ బస్తీ రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఉండే బాలికను బాపూజీనగర్ కూరగాయల మార్కెట్ ప్రాంతానికి చెందిన బొక్క అఖిలాష్ మాటలతో మభ్యపెడుతూ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయం తెలిసిన బాలిక తల్లి.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఖిలా వరంగల్: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వరంగల్ 41వ డివిజన్ శంభునిపేట విశ్వనాథ కాలనీలో సామాజిక కార్యకర్త ఎండీ.ఫసి ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో శనివారం రోడ్డెక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. మూడేళ్ల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేశారని, ఇప్పటి వరకు తాగునీరు సరఫరా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యను పరిష్కరించాలని అనేక సార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడడం లేదని ఎద్దేవాచేశారు.

ప్రపంచ శాంతికి బౌద్ధ మార్గం

హసన్‌పర్తి: ప్రపంచ శాంతికి బౌద్ధ మార్గం అనుసరణీయమని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ అన్నారు. 65వ డివిజన్ దేవన్నపేటలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానంతో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అమెరికాలో 19 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పడం హర్షనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చుంచు రవి, పీఏసీఎస్ డైరెక్టర్ విజేందర్, కాంగ్రెస్ నాయకుడు సందెల చిన్న, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మైకేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ వార్షికోత్సవం

హన్మకొండ: నేషనల్ హ్యూమన్ రైట్స్ చిల్డ్రన్స్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సంస్థ మొదటి వార్షికోత్సవాన్ని హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్ శనివారం నిర్వహించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గోవర్దన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. మానవ హక్కులు, మహిళా అభ్యున్నతికి తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో బాధ్యులు త్రివిక్రమ్‌గౌడ్, కాసగాని వేణుగౌడ్, శ్రీనివాస్, శ్యామ్, సంతోష్‌కుమార్, విజయ్, లక్ష్మయ్య, మేఘరాజ్, సుబ్రహ్మణ్యం, కల్యాణ్, రాజగోపాల్, వేణు, అమరావతి, సరిత, సుప్రియ, తస్రీమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు 30శాతం నిధులు కేటాయించాలి

నయింనగర్: కోఠారి కమిషన్ సిఫార్సుల మేరకు విద్యకు బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి ఫరాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఎస్ఐఓ విద్యార్థుల మేనిఫెస్టోను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా బడ్జెట్ నిరంతరం తగ్గుతుండటంతో విద్యాసంస్థలు దారుణమైన పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయని వాపోయారు. మైనార్టీలు, వెనుకబడిన తరగతుల విద్యాభివృద్ధి రాష్ట్రంలో కుంటుపడిందని అన్నారు. స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు విద్యాసంస్థల నుంచి సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్సీ -2023లో ఉర్దూ మీడియం స్థానాలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫహీంఉద్దీన్, అఫ్రోజ్, డానిష్ హష్మీ, ఇమ్తియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ దసరా ఉత్సవాలకు సహకరించండి

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంగణంలో జరగనున్న బతుకమ్మ, రావణ వధ, దసరా ఉత్సవాలకు సహకరించాలని కాశిబుగ్గ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు దూపం సంపత్ మాట్లాడుతూ ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ బయ్య స్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, బాంబుల కుమార్, సిద్దోజు శ్రీనివాస్, గోరంటల రాజు, మార్త ఆంజనేయులు, రాచర్ల శ్రీనివాస్, వేముల నాగరాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే ఉద్యోగాలు

న్యూశాయంపేట: రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ పాలన కారణంగా తొమ్మిదేళ్లలో నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని, బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే అందరికి న్యాయం జరుగుతుందని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి తిరుపతి అన్నారు. హనుమకొండ సుందరయ్య భవన్‌లో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత ఆత్మహత్యలకు లోను కాకూడదని, నియంత తరహా పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కిశోర్, సుచందర్, సురేష్, చిరంజీవి, అనిల్, మౌనిక, కరుణాకర్, దేవేందర్, యువన్, అశోక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కాశిబుగ్గ: వరంగల్ శివనగర్ సాయి కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో శుక్రవారం రాత్రి చేరారు. ఈ సందర్భంగా వారికి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

కాజీపేట: ఆరు గ్యారంటీ పథకాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ కాజీపేట 47వ డివిజన్ అంబేడ్కర్ నగర్, భవానీనగర్ కాలనీల్లో శనివారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, నాయకులు తొట్ల రాజు యాదవ్, గుర్రపు కోటేశ్వర్, బోయిని కుమార్ యాదవ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలి

కాజీపేట: నానాటికి పెరుగుతున్న సాంకేతిక కారణాల వల్ల ఉపాధి కోల్పోతున్న ఫొటో, వీడియోగ్రాఫర్లను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని సంఘం పట్టణ అధ్యక్షుడు తూర్పాటి జగదీశ్వర్ గుర్తుచేశారు. ఈమేరకు కాజీపేట 61వ డివిజన్ ఫాతిమానగర్‌లో ఆయన శనివారం మాట్లాడుతూ డిజిటల్, త్రీడి రంగ ప్రవేశంతో కార్మికులు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

అనాథాశ్రమంలో జన్మదిన వేడుకలు

హసన్‌పర్తి: అనాథ వృద్ధుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం అభినందనీయమని మార్కెట్ లార్డ్ వృద్ధాశ్రమ నిర్వాహకుడు నరేష్ అన్నారు. కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ తన జన్మదిన వేడుకలు శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలివేల్పుల క్రాస్‌లోని లార్డ్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 66వ డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు వల్లాల శ్రీకాంత్, నాయకులు బోడ యుగంధర్, గౌరిశెట్టి కృష్ణమూర్తి, ఇమ్మడి రాజేందర్, మేకల రాజేందర్, గిన్నారపు రవీందర్, నల్లా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌పై ఇండియా విజయంపై హర్షం

ఖిలా వరంగల్: అహ్మదాబాద్ స్టేడియంలో శనివారం జరిగిన వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై ఇండియా జట్టు విజయం సాధించింది. ఈమేరకు వరంగల్ అండర్ బ్రిడ్జి రోడ్డుపై ముత్తినేని శ్రీనివాస్, రాజేష్ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో క్రికెట్ అభిమానులు శనివారం రాత్రి టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రాజు, జిలకర వీరస్వామి, సాయి, కోలేరు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

కాజీపేట రూరల్: కాజీపేట బాపూజీనగర్‌లోని అరుంధతి మాదిగ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిలువేరు విజయభాస్కర్ తల్లి చంద్రమ్మను ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ శనివారం పరామర్శించారు. చంద్రమ్మ పక్షవాతంతో బాధపడుతూ వారం రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చింది. ఈక్రమంలో ఆమె యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కార్మికుల యోగక్షేమాలపై ఆరా

ఎంజీఎం: వేతనాలు చెల్లించడంలో ఎంజీఎం సూపరింటెండెంట్ వైఖరిని నిరసిస్తూ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఎమ్మెల్యే నరేందర్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

కాల్వలో దిగబడిన భారీ వాహనం


ఇరువైపులా స్తంభించిన ట్రాఫిక్

హసన్‌పర్తి: హనుమకొండ - హసన్‌పర్తి ప్రధాన రహదారిలోని భీమారం సెంటర్ వద్ద ట్రాఫిక్ స్తంభించింది. కరీంనగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే భారీ వాహనం భీమారం వద్ద యూ - టర్న్ తీసుకునే క్రమంలో ముందు భాగం ఎదురుగా ఉన్న కాల్వలో దిగబడింది. వెనుకభాగం డివైడర్‌ను ఢీకొనడంతో ఇరువైపులా నుంచి వచ్చే వాహనాలు నిలిచిపోయాయి. దాంతో సుమారు అరగంట పాటు రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.